క్లుప్తంగా

ప్రమాదకరంగా వంతెన ఫుట్‌పాత్



పెదనింద్రకొలను- పత్తేపురం ఆర్‌అండ్‌బీ వంతెన ఫుట్‌పాత్ దుస్థితి

నిడమర్రు: పెదనింద్రకొలను- పత్తేపురం గ్రామాలను కలిపే ఆర్‌అండ్‌బీ వంతెనపై ఉన్న కాలిబాట శ్లాబ్ పగిలిపోయి ప్రమాదకరంగా మారింది. దీనిపై నడిచివెళ్లేందుకు వీలుగా లేకపోవడంతో ప్రయాణికులు ఫుట్‌పాత్‌పై కాకుండా కింద ప్రయాణించి ప్రమాదాల బారిన పడుతున్నారు. పెదనింద్రకొలను ఉన్నత పాఠశాలకు విద్యార్థులు ఈ వంతెనపై నుంచే వెళ్లాల్సిన పరిస్థితి. అలాగే పత్తేపురం, తోలకపల్లి, ఆముదాలపల్లి, బైనేపల్లి గ్రామాల వారు మండల కేంద్రం నిడమర్రు రావాలంటే ఈ వంతెనపై నుంచే రావాలి. దీంతో అధికారులు స్పందించి కాలిబాట మార్గం మరమ్మతులు చేయించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

వైభవంగా గంగానమ్మ జాతర



గంగానమ్మ జాతర నిర్వహిస్తున్న దృశ్యం

దెందులూరు: ఏలూరు రూరల్ మండలం జాలిపూడి గ్రామంలో శ్రీ గంగానమ్మ తల్లి జాతర మహోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ఆదివారం జాలిపూడి గ్రామ అభివృద్ధి కమిటీ చైర్మన్, మాజీ సర్పంచ్ దాసరి నాగమల్లేశ్వరి తోపాటు గ్రామంలోని భక్తులు అమ్మవారికి పానకాలు, చలివిడి నైవేద్యం సమర్పించారు. గణాచార్యులు అమ్మవారి వద్దకు వచ్చి పూజలు నిర్వహించారు. అనంతరం వెలమపేటలో గ్రామసంచారం చేశారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



అలరించిన కూచిపూడి నృత్య ప్రదర్శన

దెందులూరు: గాలాయగూడెంలోని శ్రీ నాగాస్విని పేరంటాలు తల్లి నాల్గవ ఆలయ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం అమ్మవారి ఆలయ ఆవరణలో కమిటీ సభ్యులు పూజారి అన్నవరం, పూజారి సత్యనారాయణ ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. కూచిపూడి నృత్యాలు, చింతామణి నాటక ఆహుతులను అలరించాయి.

లాడ్జిలు, కల్యాణ మండపాల్లో తనిఖీలు



భీమడోలు లాడ్జిలోని సీసీ పుటేజీలను పరిశీలిస్తున్న సీఐ విల్సన్, ఎస్సై సుధాకర్

భీమడోలు: మండల కేంద్రమైన భీమడోలులో కల్యాణ మండపాలు, లాడ్జిలపై శనివారం రాత్రి పోలీసులు ఆకస్మిక తనిఖీలు చేశారు. సీఐ యూజే విల్సన్ నేతృత్వంలో ఎస్సై వై.సుధాకర్, సిబ్బంది లాడ్జిలు, కల్యాణ మండపాలను తనిఖీలు చేసి సీసీ పుటేజీలు, రికార్డులను పరిశీలించారు. లాడ్జిలకు వచ్చే వారి అడ్రస్ వివరాలను పూర్తిగా నమోదు చేయాలని సిబ్బందికి సూచించారు. క్రికెట్ బెట్టింగులు, అనుమానాస్పద వ్యక్తుల ప్రవర్తన తదితర అంశాలపై ఆరా తీశారు. తమ పరిసరాల్లో అసాంఘిక కార్యకలాపాలు జరిగితే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు.

ఐస్ పరిశ్రమను ప్రారంభించిన కేంద్ర మంత్రి



ఐస్‌పరిశ్రమను ప్రారంభిస్తున్న కేంద్రమంత్రి

ఉంగుటూరు: ఆర్నె గ్రూపు సంస్థ ఉంగుటూరులో ఏర్పాటు చేసిన శ్రీష్టి ఐస్ పరిశ్రమను ఆదివారం కేంద్ర ఉక్కు భారీ పరిశ్రమల శాఖ మంత్రి భూపతిరాజు శ్రీనివాస్ వర్మ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజుతోపాటు పలువురు ప్రజా ప్రతినిధులు, పరిశ్రమ యజమాని సాంకర మనోజుకుమార్, కూటమి నేతలు పాల్గొన్నారు.

కోడి పందేల స్థావరంపై దాడి

పెదవేగి : మండలంలోని పినకడిమిలో నిర్వహిస్తున్న కోడిపందేల స్థావరంపై దాడులు చేసినట్లు ఎస్సై కె రామకృష్ణ తెలిపారు. ఈ దాడుల్లో 9 మంది నిందితులను అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి 3 కోడిపుంజులు, 7 మోటారు సైకిళ్లు, రూ.1600 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై చెప్పారు.

భక్తిశ్రద్ధలతో ఈస్టర్ వేడుకలు



దెందులూరు: దాస్పాడు చర్చిలో మాట్లాడుతున్న వికార్ జనరల్ బాల



పెదవేగి: న్యాయంపల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న ఫాదర్ బాలస్వామి, సిస్టర్‌లు, విశ్వాసులు



దెందులూరు: సమాధుల తోటలో నివాళులర్పిస్తున్న మృతుల కుటుంబ సభ్యులు



భీమడోలు: సూరప్పగూడెంల సమాధుల వద్ద ప్రార్థనలు చేస్తున్న కుటుంబ సభ్యులు



భీమడోలు: గుండుగొలనులో ముస్తాబైన సీఎస్ఐ చర్చి



భీమడోలు: ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవ విశ్వాసులు



పెదవేగి: భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు చేస్తున్న విశ్వాసులు

పెదవేగి : ఈస్టర్ వేడుకలను ఆదివారం క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఈ సందర్భంగా క్రైస్తవ మందిరాల్లో విశ్వాసులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. పెదవేగి మండలం న్యాయంపల్లిలో ఆరోగ్యమాత దేవాలయ ప్రాంగణంలో విచారణ గురువు ఫాదర్ రాచూరి బాలస్వామి ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. ప్రభువైన క్రీస్తు మానవుని కోసం సమాధిలో నుంచి మూడవ రోజు లేచి వచ్చారని, విశ్వాసులందరూ చీకటిని విడిచి పెట్టి వెలుగులో ప్రకాశించాలని ఉపదేశించారు. కార్యక్రమంలో న్యాయంపల్లి విచారణ పరిధిలోని అన్ని గ్రామాల విశ్వాసులు, సంఘ పెద్దలు, యువతీ యువకులు, ఉపదేశులు, సెయింట్ అలోసిస్ సిస్టర్స్ పాల్గొన్నారు. వేగివాడ విచారణ ఆర్‌సీఎం దేవాలయం నందు ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. విచారణ గురువులు పాస్క్వాలి గుడ్‌ఫ్రైడే, ఈస్టర్ వేడుకల విశిష్టతలను వివరించారు. 9 గ్రామాల సంఘ విశ్వాసులు పాల్గొన్నారు. విజయరాయి పునీత అంథోనివారి దేవాలయంలో ఏసుక్రీస్తు పునరుత్థాన మహోత్సవం వైభోపేతంగా నిర్వహించారు. క్రీస్తు మరణించి మూడవ రోజు సజీవుడై లేచి మానవాళికి స్వర్గద్వారములు తెరచి రక్షణ ఇచ్చారని విచారణ గురువు దివాకర్‌రాజు తెలిపారు. ప్రత్యేక ప్రార్థనల్లో కన్యస్త్రీలు, ఉపదేశులు, విజయరాయి, ముత్తనవీడు, రాయన్నపాలెం, రాట్నాలకుంట, చింతలపాటివారిగూడెం, కొండలరావుపాలెం గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని దైవాశీస్సులు పొందారు. అలాగే హోలీగ్రేస్ మందిరంలో పాస్టర్ నడిపల్లి రాజు ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

ఏసు బోధనలు అనుసరణీయం

దెందులూరు: పునరుత్థానుడైన ఏసుక్రీస్తు బోధనలు ప్రతి ఒక్కరికీ అనుసరణీయమని ఆర్‌సీఎం ఏలూరుపేట వికార్ జనరల్ డాక్టర్ బాల అన్నారు. ఆదివారం దాస్పాడు ఆర్‌సీఎం చర్చిలో ఫాదర్ తంబి జోసెఫ్ ఆధ్వర్యంలో ఈస్టర్ వేడుకలు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా వికార్ జనరల్ ఫాదర్ బాల, ఏలూరు కదిడ్రల్ చర్చి రెక్టర్ ఫాదర్ మైకేల్ పాల్గొని మాట్లాడారు. 40 రోజుల శ్రమల కాల దీక్షలు ఆదివారంతో పూర్తయ్యాయన్నారు. జిల్లావ్యాప్తంగా దీక్షలు చేపట్టిన దీక్షదారులను క్రైస్తవ సోదరులందరినీ అభినందించారు. దెందులూరు, కొవ్వలి దాస్పాడు పాలగుడు సాల్వేషన్ ఆర్మీ చర్చల పోరాపేసర్ల ఆధ్వర్యంలో ఆదివారం తెల్లవారుజామున మృతుల సమాధుల వద్ద వారి కుటుంబ సభ్యులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కోర్ ఆఫీసర్లు రమణయ్య, సుబ్బారావు, నీరు, జోషి పల్లె శామ్యూల్, గాంధీరాణి, నక్క ఏసురత్నం తదితరులు పాల్గొన్నారు.

శోభాయమానంగా క్రైస్తవాలయాలు

భీమడోలు: మండలంలోని భీమడోలు, గుండుగొలను, పూళ్ల, సూరప్పగూడెం, పోలసానిపల్లి, అంబర్‌పేట, కోడూరుపాడు, ఎంఎంపురం, కొల్లేరు గ్రామాల్లోని ఆర్‌సీఎం, సీఎస్ఐ, రక్షణ సైన్యం తదితర చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. విద్యుత్ కాంతులతో క్రైస్తవాలయాలను శోభాయామనంగా అలంకరించారు. శనివారం రాత్రి నుంచి చర్చిల్లో క్రైస్తవులంతా ప్రత్యేక ప్రార్థనలు చేశారు. భీమడోలు ఆర్‌సీఎం చర్చిలో విచారణ కర్త షింటో థామస్ ఆధ్వర్యంలో వేకువ జాము నుంచి కొవ్వొత్తులను చేతపట్టుకుని దేవాలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. ఫాదర్ రవి దివ్యపూజాబలి కార్యక్రమాన్ని నిర్వహించి వాక్యోపదేశాన్ని అందించారు. పాపుల కోసం చనిపోయి మృత్యుంజయుడై తిరిగి లేచిన క్రీస్తు వలే ప్రతి ఒక్కరూ ప్రేమ, దయ, జాలి కలిగి తోటి వారితో కలిసి మంచిగా జీవించాలని కోరారు. తొలుత భీమడోలు విచారణ కర్త ఫాదర్ షింటో థామస్ ఈస్టర్ పండుగ విశిష్టతను వివరించారు. సూరప్పగూడెం, పెద్దలింగంపాడు తదితర గ్రామాల్లో సమాధుల వద్ద కుటుంబ సభ్యులు కొవ్వొత్తులను వెలిగించి ప్రార్థనలు చేశారు. కార్యక్రమాల్లో డీపాల్ ప్రిన్సిపల్ ఫాదర్ నెల్సన్ జాన్, ఫాదర్లు జిజో, జింటో, జోసెఫ్ పాల్గొన్నారు.

వసతి.. అధోగతి!



శిథిలావస్థలో వసతి గృహం



శ్లాబ్ పెచ్చులూడి శిథిలావస్థకు చేరిన దృశ్యం



హైవే విస్తరణకు తీసుకుంటామని తెలిపే వసతిగృహ భవనానికి వేసిన బాణం మార్కు

- ఇప్పటికే శిథిలావస్థలో కైకరం ఎస్సీ బాలుర వసతి గృహం
- జాతీయ రహదారి విస్తరణలో భాగంగా తొలగించనున్న భవనం
- ఆందోళన చెందుతున్న విద్యార్థులు

ఉంగుటూరు: కైకరం ఎస్సీ బాలుర వసతి గృహం ఇప్పటికే శిథిలావస్థకు చేరడంతో ఇక్కడున్న విద్యార్థులు నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీనికి తోడు జాతీయ రహదారి విస్తరణలో భాగంగా సర్వీసు రహదారి నిర్మించే క్రమంలో వసతి గృహం లోపలకి హైవే అధికారులు మార్కింగ్ చేశారు. సుమారు 40 మీటర్లు లోపలి వరకు వేసిన మార్కుతో నాలుగింట మూడొంతుల భవనం పోనుంది. దీంతో ఇక్కడున్న 50 మంది విద్యార్థుల భవితవ్యం ఏమిటన్నది ప్రశార్థకంగా మారనుంది.

అందుబాటులో కైకరం

1993లో ఈవసతి గృహన్ని సోషల్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఇప్పటి వరకు ఇక్కడ 3 వేల మందికి పైగా విద్యార్థులు ఈ వసతి గృహంలో ఉండి విద్య అభ్యసించారు. కైకరం అందుబాటులో ఉండటంతో మెట్ట, డెల్టా ప్రాంతంలోని పలుగ్రామాల పిల్లలతోపాటు, కొల్లేరు పరివాహక ప్రాంత పిల్లలు ఇక్కడ చదువుకుని ప్రయోజకులుగా మారారు. అయితే ఇక ఈ వసతి గృహం ఉండదని తెలియడంతో పేద వర్గాల పిల్లల్లో ఆందోళన మొదలైంది. ఇప్పటికే మండల కేంద్రమైన ఉంగుటూరు బీసీ బాలుర వసతి గృహన్ని ఎత్తివేశారు. దానిని తాడేపల్లిగూడెంలో కలిపేశారు. పల్లెలో ఉండే వసతి గృహలను పట్టణానికి మార్చేయడంతో విద్యార్థులు అంతదూరం వెళ్లడానికి ఇష్టపడటం లేదు. కైకరం ఎస్సీ హాస్టల్ భవనం తొలగించవద్దని, కనీసం పక్కనున్న చేబ్రోలు, నారాయణపురం గ్రామాల్లో అద్దె భవనంలోకి తరలించాలని కోరుతున్నారు.

ఇంకా పనులు మొదలుపెట్ట లేదు



జాతీయ రహదారి విస్తరణలో భాగంగా కైకరం ఎస్సీ బాలుర వసతి గృహంలో హైవే అధికారులు సర్వే చేసి మార్కింగ్ చేశారు. కానీ ఇంకా విస్తరణ పనులు మొదలు పెట్టలేదు. వసతి గృహం తొలగించాల్సిన పరిస్థితి వస్తే పక్క గ్రామాలైన చేబ్రోలు, నారాయణపురంలో విద్యార్థులకు అనువైన భవనంలోకి హాస్టల్ మార్చేందుకు కృషి చేస్తాం. – వార్డెన్ కె.గణపతి

కూర్మ ‘వీక్షణం’



వైకుంఠం క్యూ కాంప్లెక్స్ సమీపంలో నిర్మించిన ట్యాంక్‌లోని తాబేళ్లను వీక్షిస్తున్న భక్తులు
ట్యాంక్‌లో ఉన్న తాబేలు (అంతర చిత్రం)

ద్వారకాతిరుమల: శ్రీవారి వైకుంఠం క్యూ కాంప్లెక్స్ సమీపంలో దేవస్థానం అధికారులు ఏర్పాటు చేసిన తాబేళ్ల ట్యాంక్ చూపరులను ఆకట్టుకుంటోంది. పచ్చని ఆహ్లాదకర వాతావరణంలో ఈ ట్యాంక్‌ను నిర్మించి, అందులో తాబేళ్లను ఏర్పాటు చేశారు. స్వామివారి దర్శనార్థం ఆలయానికి వస్తున్న భక్తులు వీటిని ఎంతో ఆసక్తిగా వీక్షిస్తున్నారు. చిన్నా, పెద్దా అంతా ఈ ప్రాంతంలో సందడి చేస్తున్నారు. భక్తజన సంచారం అధికంగా ఉండే ప్రాంతంలో వీటి ఏర్పాటు పట్ల పలువురు భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సామాజిక బాధ్యతతో సంతృప్తి

దెందులూరు: స్నేహితులంతా కలిసి సామాజిక బాధ్యతగా బాధితులకు అండగా నిలబడటంలో తమకు ఎంతో సంతృప్తి లభించిందని చేయూత సేవా సంస్థ ప్రతినిధులు తెలిపారు. సంస్థ ఏర్పాటు చేసి తొమ్మిదేళ్లు పూర్తిచేసుకున్న సందర్భంగా ఆదివారం వారు వేగవరంలో విలేకరులతో మాట్లాడారు. ఇప్పటివరకు గ్రామ శివారు ప్రాంతాల్లో 110 కుటుంబాలకు రూ.10 లక్షల విలువైన నిత్యావసర వస్తువులు అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు ఎం లక్ష్మీనారాయణ, పి నాగార్జున, శరత్ బాబు, ప్రసాద్, రాటాలు రాంబాబు, మహేష్, మధు, దుర్గాప్రసాద్, అమరేశ్వర రావు పాల్గొన్నారు.

నేత్ర సమస్యలపై అప్రమత్తత అవసరం



నేత్ర పరీక్షలు నిర్వహిస్తున్న యోగానంద నేత్రవైద్యశాల బృందం సభ్యులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): శరీరంలోని అతిముఖ్యమైన అవయవమైన నేత్రాలకు వచ్చే సమస్యలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని వేమగిరికి చెందిన పరమహంస యోగానంద నేత్రవైద్య శాల వైద్యులు సూచించారు. ఆదివారం స్థానిక రామకోటి ప్రాంగణంలో మానేపల్లి రామారావు ఆధ్వర్యంలో పరమహంస యోగానంద నేత్ర వైద్యశాల బృందం, ఉషా గ్రూప్ సంస్థల అధినేత ఉషా బాలకృష్ణ సహకారంతో ఉచిత కంటి పరీక్షల శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ సమాజంలో ఎంతోమంది అంధులు చూపులేక ప్రపంచాన్ని చూసే అదృష్టం లేక విలవిల్లాడిపోతున్నారన్నారు. చూపు ఉన్నవారు మాత్రం ఎట్టిపరిస్థితుల్లోనూ అశ్రద్ధ చేయవద్దని, కంటికి ఏ చిన్న సమస్య వచ్చినా వెంట వైద్యులను సంప్రదించి చికిత్స పొంది కంటి చూపును కాపాడుకోవాలని హితవు పలికారు. ఈ శిబిరంలో 186 మంది పాల్గొనగా వారికి ఉచితంగా పరీక్షలు నిర్వహించి 25 మందికి కంటి శస్త్రచికిత్సలు అవసరమని గుర్తించారు. గుర్తించిన వారికి శస్త్రచికిత్స నిమిత్తం నేత్రవైద్యశాలకు తీసుకువెళ్లారు. అలాగే అవసరమైన 36 మందికి కళ్లజోళ్లు సబ్సిడీ ధరకు పంపిణీ చేశారు. కార్యక్రమం ప్రతి నెలా మూడవ ఆదివారం గత 12 సంవత్సరాలుగా జరుగుతోందని, నేత్ర సమస్యలు ఉన్న వారు ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని మానేపల్లి రామారావు కోరారు. ఈ శిబిరానికి హాజరైన వారికి పిల్లి పండరినాథ్, బొలిశెట్టి సురేష్ కుమార్ సేవలు అందించారు.

శ్రీనివాసుని దివ్య కల్యాణోత్సవాలు ప్రారంభం

ద్వారకాతిరుమల: శ్రీవారి ఆలయానికి దత్తత దేవాలయమైన లక్ష్మీపురంలోని శ్రీ సంతాన వేణుగోపాల జగన్నాథ వేంకటేశ్వర స్వామివారి ఆలయంలో శ్రీనివాసుని దివ్యకల్యాణ మహోత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. కల్యాణ మహోత్సవాల్లో భాగంగా ఉదయం ఆలయంలో స్వామివారిని పెండ్లి కుమారునిగా, పద్మావతి, ఆండాళ్ అమ్మవార్లను పెండ్లి కుమార్తెలుగా ముస్తాబు చేశారు. అర్చకులు, పండితులు, ఆగమ విద్యార్థుల వేద మంత్రోచ్చరణలు, భక్తుల గోవింద నామస్మరణలు, మేళతాళాలు, మంగళ వాయిద్యాల నడుమ ఈ వేడుక అత్యంత వైభవోపేతంగా జరిగింది. అంతక ముందు ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన ప్రత్యేక వేదికను ఆలయ అర్చకులు విశేషంగా అలంకరించారు. అనంతరం సింహాసనంపై కల్యాణ మూర్తులను వేంచేపు చేసి ఈ తంతును నేత్రపర్వంగా నిర్వహించారు. ఆలయ సూపరింటెండెంట్ దుర్గాప్రసాద్, పలువురు భక్తులు ఈ వేడుకలో పాల్గొన్నారు.

ఫ్రిజ్‌లు వద్దు.. కుండలే ముద్దు

- వేసవిలో మట్టి కుండల వైపు మొగ్గుచూపుతున్న ప్రజలు
- ఒక్కో కుండ ధర రూ.100 పైమాటే
- మట్టి కుండ నీరే మంచిదంటున్న వైద్యులు



అమ్మకానికి సిద్ధంగా మట్టి కుండలు, కూజాలు

ద్వారకాతిరుమల: రోజురోజుకు ఎండలు పెరిగిపోతున్నాయి. దాంతో ఉక్కపోతతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. రిఫ్రిజిరేటర్లలోని చల్లని నీటితో దాహం తీర్చుకుంటున్నారు. ఆ ఫ్రిడ్జ్‌లలోని నీరు తాగడం వల్ల ఎన్నో ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని వైద్యులు చెబుతున్నారు. మట్టి కుండలే మేలని, అందులోని నీరే తాగాలని అంటున్నారు. దాంతో ఓల్డ్ ఈజ్ గోల్డ్ మట్టి కుండలు అంటూ అన్ని వర్గాల ప్రజలు వాటిని కొనేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఈ క్రమంలోనే మట్టి కుండల విక్రయాలు ఊపందుకుంటున్నాయి.

ఫ్రిజ్‌లతో ఆరోగ్య సమస్యలు..

వేసవి తాపాన్ని తీర్చేది చల్లని నీరు. సామాన్య ప్రజలకు ఆ చల్లటి నీటిని అందించేవి మట్టి కుండలు మాత్రమే. అందుకే మట్టి కుండలను పేదవాడి ఫ్రిజ్‌లు అని అంటారు. మానవుల జీవనశైలిలో మార్పులు రావడంతో ఇప్పుడు దాదాపు అందరి ఇళ్లలోనూ ఫ్రిజ్‌లు దర్శనమిస్తున్నాయి. ఎక్కడో పేదవారి ఇళ్లలో మాత్రమే కుండలు కనిపిస్తున్నాయి. ఫ్రిడ్జ్‌ల వాడకం ఏ విధంగా పెరిగాయో.. ప్రజలకు ఆరోగ్య సమస్యలు కూడా అదేవిధంగా పెరిగాయి. ఇప్పుడు అనారోగ్యంతో ఏ వైద్యుడి వద్దకు వెళ్లినా ఫ్రిజ్‌లలో నీరు తాగొద్దని, అందులో పెట్టే వస్తువులను తినొద్దనే చెబుతున్నారు. అవి తినడం, తాగడం వల్ల ఊపిరి తిత్తులు, శ్వాసకోశ సంబంధిత సమస్యలు తలెత్తుతున్నాయని అంటున్నారు. దాంతో కొందరు ధనికులు సైతం ఫ్రిజ్‌ల వాడకాన్ని బాగా తగ్గించారు. ఈ క్రమంలోనే కాలం చెల్లిందనుకున్న కుండలకు మళ్లీ పూర్వవైభవం వస్తోంది.

పట్టణాలకు ఎగుమతి..

భీమడోలు మండలం పొలసానిపల్లికి చెందిన పేరవరపు నాగేశ్వరరావు కుటుంబం ద్వారకాతిరుమల మండలం ఎం.నాగులపల్లి అడ్డరోడ్డు లోని జాతీయ రహదారి ప్రక్కన గణపతి, కనకదుర్గమ్మ అమ్మవారి విగ్రహాలను, వేసవిలో మట్టి కుండలు, కూజాలను తయారు చేస్తున్నారు. వాటి విక్రయాల ద్వారానే జీవనోపాధిని పొందుతున్నారు. జాతీయ రహదారి పక్కన ఉండటంతో వీటి విక్రయాలు ఊపందుకుంటున్నాయి. సైజును బట్టి ఒక్కో కుండ, కూజాను రూ.100కు పైగా విక్రయిస్తున్నారు. ఏలూరు, భీమవరం, తాడేపల్లిగూడెం తదితర పట్టణాలకు చెందిన కొందరు వ్యాపారులు కుండలు, కూజాలను ఇక్కడ నుంచే కొనుగోలు చేసి తీసుకెళ్లి అధిక ధరలకు అమ్ముకుంటున్నారు.

పేదవాడికి ఈ కుండలే ఫ్రిజ్‌లు



ప్రతి ఏటా కంటే ఈ ఏడు మట్టి కుండల విక్రయాలు పెరిగాయి. ఫ్రిజ్‌లు ఉన్నవారు సైతం ఆరోగ్య రీత్యా ఈ కుండలను కొనుగోలు చేస్తున్నారు. దాంతో వీటి తయారీని కూడా పెంచాము. వేసవిలో పేదవాడికి ఈ కుండలే ఫ్రిజ్‌లు. పలు పట్టణాలకు చెందిన వ్యాపారులు మా వద్దే కుండలు కొనుగోలు చేసి తీసుకెళ్తున్నారు.

– పేరవరపు నాగేశ్వరరావు, కుండల తయారీదారుడు

ఆరోగ్య సమస్యలకు కారణం ఫ్రిజ్‌లు



ఫ్రిజ్‌లలోని నీటిని తాగడం, అందులో పెట్టినవి తినడం వల్లే ప్రజలకు ఎన్నో ఆరోగ్య సమస్యలు వస్తున్నాయి. ఫ్రిజ్‌ల వాడకాన్ని బాగా తగ్గించాలి. మట్టి కుండల్లోని నీటిని తాగితే ఆరోగ్యానికి మంచిది. వేసవిలో ఫ్రిజ్‌ల కంటే మట్టి కుండలు, కూజాలే మేలు.

– ప్రవీణ్‌కుమార్, పీహెచ్‌సీ వైద్యులు, ద్వారకాతిరుమల